నేటి అలంకారం
శ్రీమహిషాసురమర్దినీదేవి





క్యూలైన్లలో భక్తుల కిటకిట (ఇన్‌సెట్‌లో) దుర్గాదేవిగా అమ్మవారి ఉత్సవమూర్తి



జయహో దుర్గాభవానీ

పెరుగుతున్న భవానీల సంఖ్య

- దక్షిణాది రాష్ట్రాల నుంచి అధికంగా తరలివస్తున్న భవానీలు
- ఎరుపెక్కిన ఇంద్రకీలాద్రి
- కిటకిటలాడిన క్యూలైన్లు
- దర్శనానికి 5 గంటల సమయం



కృష్ణవేణి ఘాట్‌లో జల్లు స్నానాలు



విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రికి భక్తుల రాక పెరుగుతోంది. సాధారణ భక్తులతో పాటు భవానీ మాలధారులు తండోపతండాలుగా తరలివస్తున్నారు. దుర్గాదేవి అలంకారంలో కొలువైన అమ్మవారిని దక్షిణాది రాష్ట్రాల నుంచి భారీగా వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. ఉచిత దర్శనం క్యూలో ఉన్న భక్తులకు దర్శనం పూర్తి కావడానికి 5 గంటల సమయం పట్టింది. వినాయకుడి ఆలయం నుంచి ప్రారంభమయ్యే అన్ని క్యూలు భక్తులతో నిండిపోయాయి. భక్తి గీతాలను ఆలపిస్తూ భక్తులు ముందుకు సాగారు. అమ్మవారిని కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ, విజయనగరం ఎంపీ అప్పలనాయుడు, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న తదితరులు దర్శించుకున్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి పట్టువస్త్రాలు సమర్పించారు. సినీ దర్శకుడు ఏఎం రత్నం కుటుంబంతో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. వారికి వేదపండితులు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

భవానీ దీక్షలకు ఏర్పాట్లు

మహామండపం వద్ద ఇరుముడుల స్వీకరణ

10 జల్లెడ బల్లలతో కౌంటర్లు సిద్ధం



(విజయవాడ, ఆంధ్రజ్యోతి/వన్‌టౌన్) : భవానీ దీక్షల విరమణకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇరుముడులు స్వీకరించేందుకు మహామండపం పక్కనే టెంట్లు సిద్ధం చేశారు. వందల సంఖ్యలో అమ్మవారిని దర్శించుకోవటానికి వస్తున్న భవానీలు ఇక్కడ దీక్షల విరమణ చేస్తున్నారు. ఈ ఇరుముడుల స్వీకరణ కేంద్రంలో మొత్తం 10 జల్లెడ టేబుళ్లు సిద్ధం చేశారు. ఈ టేబుళ్ల వద్ద గురుభవానీలు విధులు నిర్వహిస్తున్నారు. వీరే దీక్షలు విరమణ చేస్తారు. కొబ్బరికాయలు కూడా సమర్పించాక భవానీలు కృష్ణానదికి వెళ్లి స్నానమాచరిస్తారు. మాలలను, దుస్తులను కృష్ణానదికి అర్పణం చేస్తారు. ప్రసాదాలు స్వీకరించి తిరుగు పయనమవుతారు.

హంస కదిలేనా?

విజయదశమి రోజు నదీ విహారంపై సందిగ్ధం



ప్రకాశం బ్యారేజీకి 40,616 క్యూసెక్కుల వరద

ఇన్‌ఫ్లో 10వేల క్యూసెక్కులలోపు ఉంటేనే అనుమతి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : విజయదశమి సాయంత్రం కృష్ణానదిలో హంస కదులుతుందా? ఇందుకు జలవనరుల శాఖ నుంచి అనుమతి లభిస్తుందా? దసరా ఉత్సవాల్లో ఏటా క్రమం తప్పకుండా జరిగే ఈ ఉత్సవం నిర్వహణపై ఇప్పుడు అనుమానాలు కలుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం.. నదికి ఎగువ నుంచి వస్తున్న వరద నీరే. కృష్ణానదికి ప్రస్తుతం 40,616 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రకాశం బ్యారేజీ వద్ద 25 గేట్లను అడుగు మేర పైకెత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెప్పోత్సవం నిర్వహించడం కష్టమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే, తెప్పోత్సవం నిమిత్తం ఇప్పటికే హంస వాహనాన్ని సిద్ధంచేసి దుర్గాఘాట్ వద్ద ఉంచారు.

ఏమిటీ సమస్య?

హంస వాహనం నదిలో విహరించాలంటే జలవనరుల శాఖ అనుమతి తప్పనిసరి. నదికి ఎలాంటి ఇన్‌ఫ్లో లేనప్పుడు జలవనరుల శాఖ అనుమతి ఇస్తుంది. ఇన్‌ఫ్లో ఉన్నా అది 10 వేల క్యూసెక్కులలోపు ఉండాలి. అప్పుడే హంస వాహనం జలవిహారానికి అనుమతి వస్తుంది. ప్రస్తుతం నదికి 40,616 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. విజయదశమి నాటికి తగ్గుతుందని భావించారు. అయితే, ఆ పరిస్థితి కనిపించడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో జలవిహారానికి జలవనరుల శాఖ అనుమతి ఇవ్వకపోవచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎలాంటి వర్షం లేకపోతే ఉత్సవమూర్తులను హంస పైన ఉంచి, పూజలు చేసి తర్వాత అటుఇటుగా కదిలించే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది.

ఇప్పటికి రెండుసార్లు బ్రేక్

2022లో దశమి రోజున మధ్యాహ్నం 12 గంటల నుంచి హోరున వర్షం కురిసింది. మధ్యలో కాసేపు విరామం ఇచ్చినప్పటికీ తిరిగి 3 గంటలకు కురిసింది. వర్షం ఎంతకీ తగ్గుముఖం పట్టకపోవడంతో తెప్పోత్సవం నది వద్ద నిర్వహించడం కష్టమని అధికారులు నిర్ణయించారు. సాయంత్రం ఐదు గంటల్లోపు వర్షం తగ్గితే ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకెళ్లాలని భావించారు. వర్షం తగ్గకపోవడంతో తెప్పోత్సవాన్ని రద్దు చేశారు. అంతకుముందు సరిగ్గా 21 ఏళ్ల క్రితం తెప్పోత్సవానికి పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఈవిధంగా చేశారు. ఇలా.. ఇప్పటి వరకు రెండుసార్లు తెప్పోత్సవం రద్దయింది.

లోకో పైలెట్ దారుణ హత్య

- ఇనుప రాడ్డుతో కొట్టి చంపిన గుర్తుతెలియని వ్యక్తి
- అంతకుముందు ఓ ఆటోడ్రైవర్‌పై దాడి
- దుర్గగుడి ఘాట్‌రోడ్డు వద్ద హల్‌చల్



దాడికి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తి

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వేట్రాక్‌పై విధి నిర్వహణలో ఉన్న లోకో పైలెట్‌ను గుర్తుతెలియని వ్యక్తి దారుణంగా హత్య చేశాడు. ఈ ఘటన గురువారం తెల్లవారుజామున జరిగింది. అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన డి.ఎబునైజర్ (52) రైల్వేలో లోకో పైలెట్‌గా పనిచేస్తున్నారు. ఆయన బుధవారం రాత్రి విధులకు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున వచ్చిన గూడ్స్ రైలుకు మరో ఇంజన్‌ను తీసుకురావడానికి (షంటింగ్) పాత ఎఫ్ క్యాబిన్ వద్దకు వెళ్తుండగా, నైజాంగేటు వద్ద గుర్తుతెలియని యువకుడు ఇనుప రాడ్డుతో తలపై బలంగా కొట్టాడు. దీంతో ఆయన అక్కడే కుప్పకూలిపోయారు. అక్కడే మరో ట్రాక్‌పై షంటింగ్‌లో ఉన్న లోకో పైలెట్ పృథ్వీరాజ్.. ఎబునైజర్‌ను గమనించి జీఆర్పీ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడికి చేరుకుని అతడిని ముందుగా రైల్వే ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, కొద్దిసేపటికే మరణించారు. దీనిపై జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ జేవీ రమణ కేసు నమోదు చేశారు. ఆ మార్గంలో ఉన్న సీసీ కెమెరాలను గమనించగా, ఒక యువకుడు ఒంటిపై చొక్కా లేకుండా ఆ పరిసర ప్రాంతాల్లో సంచరించినట్టు పోలీసులు గుర్తించారు. అతడు గంజాయి బ్యాచ్ గానీ, మతిస్థిమితం లేని వ్యక్తి గానీ అయ్యి ఉంటాడని భావిస్తున్నారు. ఎబునైజర్‌పై దాడి చేయడానికి ముందు నైజాంగేటు వద్ద ఆటోలో నిద్రపోతున్న హఫీజ్ అనే వ్యక్తిపై ఇనుప రాడ్డుతో దాడి చేసినట్టు తేలింది. నిందితుడి ఆచూకీ తెలియలేదు. ఇందుకు రెండు ప్రత్యేక బృందాలను నియమించారు. కాగా, నిందితుడు హత్యకు ముందు దుర్గగుడి ఘాట్‌రోడ్డు గేటు వద్ద హల్‌చల్ చేసినట్టు రైల్వే పోలీసులు గుర్తించారు. ఎంతకీ నియంత్రణలో లేకపోవడంతో పోలీసులు జీపులో ఎక్కించుకుని రైల్వేస్టేషన్ వద్ద వదిలిపెట్టినట్టు తెలిసింది.

పండుగ సందడి



విజయవాడ, ఆంధ్రజ్యోతి : దసరా పర్వ దినాన్ని పురస్కరించుకుని నగరంలో షాపింగ్ సందడి మొదలైంది. బీసెంట్ రోడ్డు మూడు రోజులుగా సందడిగా మారింది. ఒకవైపు దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులు, మరోవైపు షాపింగ్ దగ్గర కొనుగోలుదారుల హడావిడితో అంతటా కోలాహలం కనిపిస్తోంది. బందరు రోడ్డులోని వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. షోరూమ్‌లు సైతం లైటింగ్స్, ఆఫర్లతో అదరగొట్టేస్తున్నాయి.

బుధవారం (మూలానక్షత్రం) నాటి ఆదాయం రూ.38.05లక్షలు

వన్‌టౌన్, అక్టోబరు 10 : ఇంద్రకీలాద్రిపై బుధవారం (మూలానక్షత్రం) సరస్వతీదేవి అలంకారంలో బెజవాడ కనకదుర్గ భక్తులకు దర్శనమిచ్చింది. ఈ సందర్భంగా రూ.500 టిక్కెట్ల ద్వారా రూ.1,31,000లు, రూ.300 టిక్కెట్ల ద్వారా రూ.14,100లు, రూ.100ల టిక్కెట్ల ద్వారా రూ.15,500లు ఆదాయం సమకూరింది. 43,427 లడ్డూలను విక్రయించగా, రూ.6,51,405లు లభించింది. ఆరు లడ్డూల ప్యాకింగ్‌ల ద్వారా రూ.27,65,000లు ఆదాయం వచ్చింది. కుంకుమార్చన రూ.3000 టికెట్ల ద్వారా రూ.36వేలు, చండీహోమం రూ.4000 టిక్కెట్ల ద్వారా రూ.16వేలు, పత్యేక ఖడ్గమాల టిక్కెట్ రూ.5,116 ద్వారా రూ.15,348లు, పబ్లికేషన్‌లు, ఫోటోలు, క్యాలెండర్ల ద్వారా రూ.7,078లు ఆదాయం సమకూరింది. తలనీలాల సమర్పణ రుసుము రూ.40 టిక్కెట్ ద్వారా రూ.1,53,880లు ఆదాయం కలిపి మొత్తంగా రూ.38,05,661లు సమకూరింది.



కుంకుమార్చనసేవలో దంపతులు



సువాసినీ పూజ



జల్లు స్నానంలో భక్తులు



అన్నదాన సేవలో..



ఓం నమో దుర్గా

ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాలలో కనకదుర్గమ్మ గురువారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వివిధ ఆర్జిత సేవల ద్వారా రూ.64,70,960 ఆదాయం సమకూరింది.





కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మకు అమ్మవారి చిత్రపటం ఇస్తున్న ఈవో రామారావు, డీఈవో రత్నరాజు, దుర్గమ్మసేవలో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ దంపతులు

దుర్గమ్మసేవలో ప్రముఖులు..

విజయవాడ, అక్టోబరు 10 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గాదేవి అలంకారంలో కనకదుర్గమ్మను పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. అధికారులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితులు ఆశీస్సులు అందజేశారు. అనంతరం ఈవో కేఎస్ రామారావు, డీఈవో రత్నరాజు వారికి అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. అమ్మవారిని దర్శించుకున్నవారిలో కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర ఆరోగ్య కుటుంబసంక్షేమశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, ప్రముఖ సినీనిర్మాత ఏఎం రత్నం, పలువురు జడ్జిలు తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మిక కార్యక్రమాలు సంతృప్తికరం

– అప్పలనాయుడు, విజయనగరం ఎంపీ

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు సంతృప్తికరంగా ఉన్నాయి. క్యూలైన్ల నుంచి ఘాట్ రోడ్డు వరకు భక్తులతో మాట్లాడగా ఏర్పాట్లపై అంతా సంతృప్తి వ్యక్తం చేశారు.

అమ్మ కరుణాకటాక్షాలు ప్రజలపై ఉండాలి

– శ్రీనివాసవర్మ, కేంద్రమంత్రి

దుర్గమ్మ కరుణా కటాక్షాలు ప్రజలందరిపైనా ఉండాలని కోరుకున్నా. సామాన్య భక్తులు ఎలాంటి ఇబ్బందిలేకుండా అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ఆర్టీసీ లాభాలతో నడవాలి

– కొనకళ్ల నారాయణ

శరన్నవరాత్రి ఉత్సవాల్లో అన్నిశాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. సామాన్య భక్తులు సాఫీగా దర్శనం చేసుకుంటున్నారు. ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆశీర్వచనంతో ఆర్టీసీ చైర్మన్ పదవి దక్కింది. కనకదుర్గమ్మ దయతో ఆర్టీసీ లాభాలతో సురక్షితంగా నడవాలని కోరుకుంటున్నా.

ఇంద్రకీలాద్రిపై ఫలించిన ప్రయోగాలు

– సుజనాచౌదరి

ఈ ఏడాది శరన్నవరాత్రి మహోత్సవాలలో ముందస్తు ప్రయోగాలన్నీ మంచి ఫలితాలను ఇచ్చాయి. వీఐపీ దర్శనాలకు సమయం కేటాయింపు, దివ్యాంగులు, వృద్ధులను తీసుకెళ్లడానికి మినీ మూవింగ్ చైర్ బాగా పనిచేశాయి. వాటివల్ల సామాన్య భక్తుల దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగలేదు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తాం. కనకదుర్గమ్మ కొలువైన ప్రాంతానికి ఎమ్మెల్యేగా ఎన్నికవ్వడం అమ్మవారి అనుగ్రహమే.

కనకదుర్గమ్మ సన్నిధిలో వేదార్చన..

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై ప్రతీఏటా దసరా ఉత్సవాల సమయంలో దుర్గాష్టమి సందర్భంగా కనకదుర్గమ్మ సన్నిధిలో వేదార్చన జరుగుతుంది. గురువారం ఆలయంలోని మహామండపం ఆరో అంతస్తులో వేదపండిత సత్కార సభను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని పండిత సత్కారం చేశారు. ఆయన మాట్లాడుతూ, వేదాలను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని గురించి చెప్పారు. తెలుగు రాష్ట్రాలు, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాల్లో నిష్ణాతులైన పండితులు, ఘనాపాటీలు, క్రమపాటీలు వేదసభకు విచ్చేశారు. అనంతరం వేద ఘోషతో శాంతిమంత్రాలు పఠించారు. వేద పారాయణ చేశారు. అనంతరం పండితులను సత్కరించారు. కార్యక్రమంలో 130 మంది ఘనాపాటీలకు రూ.6వేలు చొప్పున, 262 మంది క్రమపాటీలకు రూ.5వేలు చొప్పున పారితోషకాలను, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. సభాధ్యక్షుడికి రూ.10వేలు పారితోషకం అందజేశారు.





వేద పండితులను సత్కరిస్తున్న మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సత్యప్రసాద్ యాదవ్



ఐజీ అశోక్‌కుమార్‌కు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేస్తున్న ఈవో వరప్రసాదరావు

సుబ్బారాయుడి సేవలో ఏలూరు రేంజ్ ఐజీ

మోపిదేవి, అక్టోబరు 10 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ దర్శించుకున్నారు. గురువారం ఉదయం ఆయనకు ఆలయ అధికారులు, అర్చక బృందం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను ఐజీ అశోక్‌కుమార్, ఎస్పీ ఆర్.గంగాధర్‌రావుకు అందజేవారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ మోపిదేవిలో ప్రస్తుతం పోలీస్ అవుట్ పోస్టు ద్వారా సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు చల్లపల్లి స్టేషన్‌లో రికార్డు చేయటం జరుగుతుందని, మోపిదేవిలోనే కేసులకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసే ప్రక్రియ త్వరలో చేపట్టనున్నట్టు తెలిపారు. మండలానికి శాశ్వత స్టేషన్ ఏర్పాటయ్యేలా గెజిట్ నోటిఫికేషన్ ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపినట్టు తెలిపారు. డీఎస్పీ మురళీధర్, సీఐ ఈశ్వరరావు, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక శాఖ ఆధ్వర్యంలో..

నేటినుంచి నారీశక్తి ఉత్సవాలు

వన్‌టౌన్, అక్టోబరు 10 : పర్యాటకశాఖ ఆధ్వర్యంలో పున్నమీఘాట్ బబ్బూరి గ్రౌండ్స్‌లో శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఈనెల 11, 12, 13న నారీశక్తి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు పర్యాటక శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన మహిళలకు పురస్కారాలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, హస్తకళా ప్రదర్శనలు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు చెందిన ప్రఖ్యాత సంప్రదాయ వంటకాలు, జాతీయ, అంతర్జాతీయ రుచులతో కూడిన ఫుడ్ ఫెస్టివల్, డ్రోన్ షోతో పాటు బాణాసంచా వేడుకలు ఉంటాయన్నారు. శుక్రవారం మొదటిరోజు ప్రముఖులు, అతిథులతో ఆత్మీయసభ ఉంటుందన్నారు. 12, 13న కళా ప్రదర్శనలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయని, చివరి రోజు బాణాసంచాతో ముగుస్తుందన్నారు.

నారీశక్తి ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

బబ్బూరి గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. వేదికను విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. దుష్ట సంహారంతో పాటు శిష్ట సంరక్షణ చేసిన అమ్మవారిని స్ఫూర్తిగా తీసుకునేందుకు గుర్తుగా వేదిక పరిసర ప్రాంతాల్లో అమ్మవారి కటౌట్లను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో అలంకరించారు. మహిళలకు సంబంధించిన అనేక చిత్రాలను ఏర్పాటు చేశారు.

అగ్రిసెట్-2024 ఫలితాలు విడుదల

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గత ఆగస్టు 27న ఆన్‌లైన్‌లో నిర్వహించిన అగ్రిసెట్-2024 పరీక్షా ఫలితాలను వీసీ శారదాజయలక్ష్మి గురువారం విడుదల చేశారు. అగ్రిసెట్‌కు 897మంది బాలికలు, 659మంది బాలురు కలిపి 1,556 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 1,469 మంది వ్యవసాయ డిప్లొమా, 35మంది సేంద్రీయ వ్యవసాయం, 52 మంది విత్తన సాంకేతిక పరిజ్ఞానం విభాగాలో పరీక్షలు రాశారు. అగ్రిసెట్‌లో మొత్తం 1,447(93.0%)మంది అభ్యర్థులు ఉత్తీర్ణత సాధించారని రిజిస్ట్రార్ రామచంద్రరావు ప్రకటించారు. అగ్రిసెట్ ఫలితాలు శుక్రవారం నుంచి angrau.ac.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని, ర్యాంక్‌కార్డులను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని చెప్పారు. కౌన్సెలింగ్ తేదీల వివరాలను వెబ్‌సైట్ ద్వారా తెలుసుకోవచ్చని ఆయన సూచించారు.

వరద సాయంపైనా..

తప్పుడు ప్రచారమా!

» ఎంపీ కేశినేని చిన్ని ఆగ్రహం



అమరావతి, అక్టోబరు10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల పాపంతో బెజవాడను వరద ముంచెత్తితే.. చంద్రబాబు బాధితులను ఆదుకున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చెప్పారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కొంత మంది పేటీఎం బ్యాచ్ విజయవాడ వరద బాధితుల గురించి ధర్నాచేశారు. వరదల సమయంలో వాళ్లలో ఒక్కడూ కనిపించలేదు. చంద్రబాబు 10రోజులు విజయవాడ కలెక్టరేట్‌లో ఉండి, నిద్రహారాలు మాని, బాధితులకు సహాయ, పునరావాస కార్యక్రమాలు అందించారు. ప్రతి వీధికి వెళ్లి బాధితుల్ని ఓదార్చి, ధైర్యం చెప్పారు. చంద్రబాబు కృషి వల్ల త్వరగా వరద నుంచి బయటపడ్డామని విజయవాడ వాసులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కానీ పేటీఎం బ్యాచ్ అబద్దాలు చెప్పడం మానలేదు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ వైసీపీ పేటీఎం బ్యాచ్ అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 4లక్షల మందికిపైగా వరద బాధితుల ఖాతాలకు ప్రభుత్వం రూ.600కోట్లు జమచేసింది. 350 ఫైరింజన్లు పెట్టి ఇళ్లను శుభ్రం చేయించారు. చంద్రబాబు పిలుపుతో రూ.450కోట్లు విరాళాలు వచ్చాయి. నష్టపోయిన ప్రతి కుటుంబానికి సాయం చేయాలని చంద్రబాబు స్పష్టంగా ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ప్రతి ఒక్కరి అకౌంట్‌లో పరిహారం జమ చేస్తున్నాం. భోజనాలకు రూ.57.4కోట్లు ఖర్చయితే.. జగన్ పత్రికలో రూ.368కోట్లు అని ముద్రించారు. శానిటేషన్‌కు రూ.18.34కోట్లు అయితే.. రూ.51కోట్లు అనిరాశారు. వైసీపీ హయాంలో హెక్టారుకు రూ.15వేలు మించి ఇవ్వలేదు. చంద్రబాబు రూ.25వేలు ఇచ్చారు. మునిగిన ఇళ్లకు రూ.25వేలు ఇచ్చాం. జగన్ ఏనాడూ రూ.4వేలు మించి ఇవ్వలేదని గుర్తు చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతుల జీవితాల్లో మార్పు

ఉంగుటూరు, అక్టోబరు 10: ప్రకృతి వ్యవసాయం చిన్న, సన్నకారు రైతుల జీవితాలను మారుస్తోందని, రైతుల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయం రాష్ట్రంలో మరింతగా విస్తరిస్తున్నట్టు రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ టి.విజయకుమార్ అన్నారు. రాష్ట్రంలో అమలుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలపై సంపూర్ణ అవగాహనకోసం నీతి అయోగ్ గౌరవసభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌చంద్ నేతృత్వంలో ఎనిమిది మంది సభ్యులతో కూడిన బృందం గురువారం ఏలూరు, కృష్ణాజిల్లాల్లో పర్యటించింది. తొలుత కృష్ణాజిల్లా ఉంగుటూరు మండలం, ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ శిక్షణా భవనంలో విజయకుమార్ బృంద సభ్యులకు ఏపీసీఎన్ఎఫ్ గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్రంలో 2016లో 40వేలమంది రైతులతో మొదలైన ప్రకృతి వ్యవసాయం ఇప్పటికి 10లక్షలమంది రైతులవరకు చేరుకుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రకృతి వ్యవసాయ విధానాలు ఆదర్శనీయమని నీతి ఆయోగ్ గౌరవ సభ్యులు ప్రొఫెసర్ డాక్టర్ రమేష్‌చంద్ ప్రశంసించారు. వ్యవసాయ, రైతుసంక్షేమ మంత్రిత్వశాఖ కమిషనర్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయపద్ధతులను బలోపేతం చేయడానికి మరిన్ని పరిశోధనలు చేయాలన్నారు.



నీతిఅయోగ్ గౌరవసభ్యుడు ప్రొఫెసర్ రమేష్‌చంద్‌కు పుష్పగుచ్ఛంతో స్వాగతం పలుకుతున్న విజయకుమార్

నాగాయలంకలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

నాగాయలంక : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సతీమణి మండలి విజయలక్ష్మి, కుమార్తె శీలం కృష్ణ ప్రభ, కోడలు సాయి సుప్రియ తదితరులు వేడుకల్లో పాల్గొని బతుకమ్మ తల్లిని కీర్తిస్తూ నృత్యాలు చేశారు. నాగాయలంక పోతురాజు స్వామి ఆలయం దగ్గర నుంచి వినాయకుడి గుడి మీదుగా పెద్ద సంఖ్యలో బతుకమ్మలను చేతపట్టుకుని శ్రీరామ పాదక్షేత్రం ఘాట్ వద్దకు చేరుకుని బతుకమ్మ వేడుకలు నిర్వహించగా, కార్యక్రమంలో మండలి వెంకట్రామ్ పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు, దివి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ బాలవర్ధిరావు, సుదర్శి సంస్థ ప్రతినిధి తలశిల రఘుశేఖర్, నాగాయలంక పంచాయతీ పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.



బతుకమ్మ వేడకలో యువతులు

గుళ్లపల్లి జ్యోత్స్నకు కన్నీటి వీడ్కోలు

» ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ నివాళి

» సుంకరను పరామర్శించిన రాఘవులు

» వారంరోజులు 'బార్' సంతాప దినాలు

విజయవాడ లీగల్, అక్టోబరు 10 : గుళ్లపల్లి జ్యోత్స్న పార్థీవదేహాన్ని గురువారం పలువురు న్యాయవాదులు, సీపీఎం, ఐద్వా నాయకులు, వైద్య ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. వీరిలో అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి గూడపాటి లక్ష్మీనారాయణ, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, ఎం.ఎ.బేబి, నేతలు సీహెచ్ బాబురావు, దోనేపూడి కాశీనాథ్, వై.కేశవరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి టి.రమాదేవి, సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్రకమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్, వైద్యులు సురేంద్ర, జితేంద్ర, సుధాకర్, ప్రమోద్, అమ్మన్న, సూరపనేని ప్రవీణ్, సూరపనేని నవీన్, అరుణా సురేంద్ర, మారుతి, పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ, బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, సూరాబత్తుల మల్లేశ్వరరావు, భీమవరం న్యాయమూర్తి ధనరాజ్, పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి అరుణ్‌కుమార్, అమ్మ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వై.సుబ్బారావు, మెట్రో ఏజెన్సీస్ అధినేత వై.రమేష్, రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్ర కుమార్, ఎంబీవీకే ఇన్‌చార్జి తులసీరావు, బాలోత్సవ్ భవన్ కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం జ్యోత్స్న భౌతికకాయాన్ని ఉదయం 11 గంటలకు ఎన్ఆర్ఐ వైద్యకళాశాల విద్యార్థులకు పరిశోధన నిమిత్తం అప్పగించారు.



జ్యోత్స్న పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న దమ్మాలపాటి శ్రీనివాస్, గూడపాటి లక్ష్మీనారాయణ, రాఘవులు తదితరులు

వారంపాటు 'బార్' సంతాప దినాలు

– అరిగెల శివరాంప్రసాద్ (రాజా)

విజయవాడ లీగల్ : జ్యోత్స్న మేడమ్ దుర్మరణం బాధాకరమని బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా) అన్నారు. ప్రమాదం జరిగిన బస్సులో తాను కూడా వున్నానని, అందరూ గాఢనిద్రలో వుండగా తాము ప్రయాణిస్తున్న బస్సు ఆగివున్న లారీని ఢీకొట్టి పక్కనే వున్న మరో లారీని ఢీకొందన్నారు. ప్రమాదంలో డ్రైవర్ వెనుక సీటులో వున్న సుంకర రాజేంద్రప్రసాద్‌కు గాయాలు కాగా.. జ్యోత్స్న మేడమ్ బస్సు ముందు అద్దాల నుంచి కిందకు పడిపోయారని, బస్సు ఆమె పైనుంచి వెళ్లడంతో మృతిచెందారని చెప్పారు. కిందపడిన మేడమ్ పైనుంచి బస్సు వెళ్లకుండా వుండివుంటే రోడ్డుదెబ్బలతో బ్రతికివుండేవారని రాజా ఆవేదన వ్యక్తం చేశారు. తనతో పాటు పదిమంది న్యాయవాదులకు స్వల్ప గాయాలయ్యాయని రాజా తెలిపారు.

జ్యోత్స్న మేడమ్ మృతికి బెజవాడ బార్ వారం రోజుల పాటు సంతాపదినాలుగా ప్రకటించాలని నిర్ణయించినట్టు రాజా తెలిపారు. శుక్రవారం నుంచి వారం రోజుల పాటు ఈ సంతాపదినాలు వుంటాయని ఆయన పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్



క్రీడాకారులను అభినందిస్తున్న సెంట్రల్ ఏసీపీ దామోదర్

జాతీయ తైక్వాండోకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు

విజయవాడ స్పోర్ట్సు : కడప జిల్లా రైల్వే కోడూరులో 4, 5వ తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్‌లో ఉమ్మడి కృష్ణా జిల్లా క్రీడాకారులు స్వర్ణంతో సత్తాచాటారు. దీంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎస్.భవిష్య మోహిత స్వర్ణం సాధించగా, ఎస్.పావనిసాయి, యు. శ్యామ్ కుమార్ (రజతం), ఎం.మోన, పి.చరణ్, ఎం.సింధు, డి.మేఘన (కాంస్యం) సాధించారు. ఈసందర్భంగా సెంట్రల్ ఏసీపీ కె.దామోదర్, మాచవరం సీఐ సీహెచ్‌ప్రకాష్ క్రీడాకారులను కోచ్ ఎం.అంకమ్మారావులను అభినందించారు.

రుణాల రీషెడ్యూల్‌లో న్యాయం చేయాలి

» కౌలు రైతు సంఘం డిమాండ్

గవర్నర్‌పేట/ఆటోనగర్, అక్టోబరు 10 : వరదల్లో పంట నష్టపోయిన కౌలురైతులు బ్యాంకుల ద్వారా తీసుకున్న పంట రుణాలను రీషెడ్యూల్ చేయాలని, రుణాలు తీసుకోని కౌలురైతులకు పంట నష్టం ప్రభుత్వం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.హరిబాబు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రుణాల రీషెడ్యూల్లో కూడా కౌలు రైతులకు మేలు జరగాలంటే గ్రామసభలు పెట్టి అర్జీలు పెట్టుకునేలా ప్రభుత్వం ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. వంటలు నష్టపోయిన కౌలురైతులు తిరిగి వ్యవసాయ పనులు కొనసాగించేందుకు కొత్తగా పంట రుణాలు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

రీషెడ్యూల్ హర్షణీయం

వరదల్లో పంట నష్టపోయిన రైతులకు రుణాలను రెండేళ్ల పాటు రీ షెడ్యూల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కౌలురైతుల సంఘం స్వాగతిస్తుందని ప్రకటనలో తెలిపింది. సీసీఆర్ కార్డు ఉండి పంటరుణం పొందని వారిని, ఈ క్రాప్ అయి బ్యాంకుల ద్వారా పంట రుణాలు రాని కౌలు రైతులకు మేలు చేయడానికి ప్రభుత్వం చొరవ చూపాలని సంఘం కోరింది.

14న కాశీవిశ్వేశ్వర దేవస్థానం షాపుల వేలం

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీవిశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంకు చెందిన 2, 3 షాపుల వేలం ప్రకటన ఈనెల 14న ఉదయం 10 గంటలకు దేవదాయ ధర్మాదాయశాఖ అధికారుల పర్యవేక్షణలో ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తల, భక్తుల, పాటదారుల సమక్షంలో సీల్డు టెండర్ కం బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో యడ్లపల్లి సీతారామయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్ల వ్యాపారం చేసుకునే లైసెన్సు హక్కులను పొందేందుకు షాపు ఒక్కింటికి రూ. 50 వేలు దరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని తెలిపారు. దేవస్థానంకు భక్తులచే సమర్పించబడిన వస్త్రాలు బహిరంగ వేలంలో దక్కించుకునేందుకు 14న పాడుకునేందుకు వేలంపాట నిర్వహిస్తామన్నారు. వివరాలకు 70937 28892 నెంబరును సంప్రదించాలని కోరారు.

జగన్మాత నమోస్తుతే



దుర్గాదేవి అలంకారంలో మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు ఎంఎస్ బేగ్



చల్లపల్లి బంగ్లా సమీపంలో, గుణదలలోని మద్దిరావమ్మ, త్రిశక్తిపీఠంలో కాళీమాత, ధనకొండ అమ్మవారు, రత్నాగార్డెన్స్‌లో

చిట్టినగర్, అక్టోబరు 10: దసరా మహోత్సవాలు ఎనిమిదో రోజు గురువారం అమ్మవారు దుర్గాదేవి అలంకారంలో భక్తులు దర్శనమిచ్చారు. చిట్టినగర్‌లోని మహాలక్ష్మి అమ్మవారు ఉదయం దుర్గాదేవి అలంకారంలో భక్తులు దర్శనమిచ్చారు. మహిళలు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు అసౌకర్యం కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. మహాలక్ష్మి అమ్మవారిని టీడీపీ రాష్ట్ర నాయకులు ఎం.ఎస్.బేగ్ దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం చేయించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. పాలఫ్యాక్టరీ సమీపంలో విజయదుర్గా రామలింగేశ్వర, పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో విజయదుర్గా అమ్మవారు, దుర్గాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. కొత్తపేటలో గంగానమ్మ అమ్మవారి దేవస్థానంలోని మంగళగౌరి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో అన్నపూర్ణాదేవి గురువారం దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో యడ్లపల్లి సీతారామయ్య, వంశపారంపర్య ధర్మకర్తల పర్యవేక్షణలో భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శ్రీ మద్దిరావమ్మతల్లి ఆలయంలో చండీహోమం

భారతీనగర్: గుణదలలోని శ్రీ మద్దిరావమ్మ తల్లి దేవస్థానంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం కార్యక్రమం జరిగింది. కరెన్సీనగర్ కాలనీలోని దాసాంజనేయ దేవస్థానంలో ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో అమ్మవారిని శ్రీదుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

దుర్గాదేవిగా కాళీమాత

కృష్ణలంక: త్రిశక్తి పీఠంలోని కాళీమాత అమ్మవారు భక్తులకు దుర్గాదేవిగా దర్శనమిచ్చింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమ పూజలు నిర్వహించారు. విశేష హారతుల అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.

మొగల్రాజపురం: మొగల్రాజపురం ధనకొండ మీద శ్రీశ్రీశ్రీ దుర్గా భవానీ అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. ●మధురానగర్ మెయిన్ రోడ్డు రత్నా గార్డెన్స్‌లో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

ప్రతి రోజూ పది చీరలు

మధురానగర్: మధురానగర్ కొబ్బరితోటలో శ్రీ కనకదుర్గా భవానీ భక్త బృందం ఏర్పాటు చేసిన దసరా వేడుకల్లో ప్రతి రోజు సాయంత్రం పూజా కార్యక్రమం తరువాత జనసేన డివిజన్ ఇన్‌చార్జి కెంబూరి కృష్ణ ఆధ్వర్యంలో మహిళలకు లక్కీ డ్రా నిర్వహిస్తున్నారు. డ్రాలో గెలుపొందిన వారికి ప్రతి రోజు 10 చీరలు బహూకరిస్తున్నారు.

భవానీపురం: ఊర్మిళానగర్‌లో ఉన్న పోలేరమ్మ ఆలయంలో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

నవదుర్గలుగా చిన్నారులు

హెచ్‌బీ కాలనీలో సంకల్పసిద్ధి షిర్డీ సాయిబాబా ఆలయంలో దుర్గాష్టమిని పురస్కరించుకుని చిన్నారులను నవదుర్గలు గా తీర్చిదిద్ది పూజలు చేశారు. దుర్గాదేవిగా అమ్మవారు పూజలు అందుకున్నారు.

వన్‌టౌన్: పాత శివాలయంలోని భ్రమరాంబ అమ్మవారు శ్రీదుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమపూజ, సుహాసినీ పూజలు జరిగాయి.

కేబీఎన్‌లో సామూహిక కుంకుమార్చనలు

కేబీఎన్ కళాశాలలో అమ్మవారు శ్రీదుర్గాదేవిగా దర్శనం ఇచ్చారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. శ్రీకన్యకాపరమేశ్వరి విస్సాకొత్తి వెంకటరత్నం హిందూ హైస్కూల్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీదుర్గ సహిత ద్విశత చండీయాగ మహోత్సవంలో భాగంగా పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలను నిర్వహించారు.

పాతరాజరాజేశ్వరి పేట: 34వ డివిజన్ కేదారేశ్వరపేట శ్రీ శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు శ్రీ దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజాము నుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

విజయవాడ కల్చరల్: శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో అమ్మవారు దుర్గాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సిద్ధార్థ నగర్‌లోని సిద్ధార్థ హోటల్ మేనేజిమెంట్ కళాశాల గ్రౌండ్‌లో యదావిధిగా శ్రీశత చండీ హోమాత్మక దశ మహావిద్య హోమాలు, గురుపూజ, గోపూజ, చండీహోమాలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



నవదుర్గలుగా చిన్నారులకు పూజలు, కేబీఎన్ కాలేజీలో సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు, సిద్ధార్థ నగర్‌లో, శివకాళేశ్వరి అమ్మవారి దేవస్థానంలో దుర్గాదేవిగా అమ్మవారు

చంద్రబాబు ప్రభుత్వంలోనే ధరల స్థిరీకరణ

రైతుబజారులో పామాయిల్, టమోటా, ఉల్లి అమ్మకాల కౌంటర్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే గద్దె



పామాయిల్ ప్యాకెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక, అక్టోబరు 10 : గత వైసీపీ ప్రభుత్వ అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఏనిమిది సార్లు కృష్ణలంక ప్రాంతానికి వరదలు వచ్చాయని, అప్పుడు ఏనాడు ఒక్క రూపాయి కూడా బాధితులకు పరిహారం ఇవ్వని వైసీపీ ఇప్పుడు ఏ ముఖంతో బాధితులకు పరిహారం ఇవ్వాలని ధర్నా చేస్తారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ధరల స్థిరీకరణ చేసి పేదలకు నిత్యావసరాలను అందుబాటు ధరలకు విక్రయిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని ఆయన చెప్పారు. కృష్ణలంక రైతుబజారులో పామాయిల్, టమోటా, ఉల్లిపాయల అమ్మకాల ప్రత్యేక కౌంటర్ ప్రారంభోత్సవ కార్యక్రమం గురువారం జరిగింది. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ కౌంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరల స్థిరీకరణ చేసిన ప్రభుత్వం తమ ప్రభుత్వమేనన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు చెప్పకుండా 2014లో, ఇప్పుడు కూడా ధరల స్థిరీకరణ చేసి చూపిస్తున్నారని గద్దె తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, కేశనం భావన్నారాయణ, పుప్పాల రమేష్, వేజర్ల రమేష్, సహాయ సివిల్‌సప్లైస్ అధికారి శ్రీనివాస్, రైతుబజార్ ఈఓ విక్టర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గద్దె

కృష్ణలంక 22వ డివిజన్‌లోని నవీన్‌కుమార్ రోడ్డులో శ్రీ కనకదుర్గ అమ్మవారి ఉత్సవ సేవా కమిటీ ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. అక్కడ జరుగుతున్న అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.

పాయకాపురం: పాయకాపురం మెయిన్ రోడ్డులో రైతు బజార్‌లో సబ్సిడీ పామోలిన్ దుకాణాన్ని గురువారం సివిల్ సప్లై శాఖ ఏఎస్‌వో లక్ష్మణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మణబాబు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఉపయోగపడేలా తక్కువ ధరకు పామోలిన్ నూనెను అందిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ శరత్, రైతుబజార్ ఈవో, సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఏఎస్‌వో లక్ష్మణబాబు

తమ్మిన పోతరాజు కృషి మరువలేనిది

సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు

వన్‌టౌన్, అక్టోబరు 10: నగర ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించిన తమ్మిన పోతరాజు కృషి మరువలేనిదని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు కొనియాడారు. తమ్మిన పోతరాజు 112వ జయంతి కార్యక్రమం సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో కొత్తపేట లెనిన్ భవన్‌లో నిర్వహించారు. పోతరాజు చిత్రపటానికి కోటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ్మిన పోతరాజు నగరంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి తన వంతు కృషి చేశారన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం "విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు" అనే నినాదంతో 52 మంది కమ్యూనిస్టు పార్టీ శాసనసభ్యులతో తమ్మిన సహా తమ శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేసి, విశాఖ ఉక్కు పరిశ్రమను సాధించారని గుర్తు చేశారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్ శక్తుల లాభాల కోసం ప్రైవేటీకరించటం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శివర్గ సభ్యులు తాడి పైడయ్య, మూలి సాంబశివరావు, పంచదార్ల దుర్గాంబ, కొట్టు రమణారావు, కార్యవర్గ సభ్యులు, డివిజన్ పార్టీ కార్యదర్శులు, మురా కార్మిక సంఘం కార్యదర్శి నాగేశ్వరరావు, ఏఐఎస్ఎఫ్ నగర నాయకులు ఎస్.మోహన్, శీరం రవి, హరిశ్ తదితరులు పాల్గొన్నారు.



పోతరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నగర కార్యదర్శి కోటేశ్వరరావు, తదితరులు

పాత శివాలయంలో భ్రమరాంబ అమ్మవారికి సారె సమర్పణ



పాత శివాలయంలో అమ్మవారికి పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల

వన్‌టౌన్, అక్టోబరు 10: పాత శివాలయంలో భ్రమరాంబ అమ్మవారు, మల్లేశ్వరస్వామిలను గురువారం ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి సారె సమర్పించారు. అమ్మవారి దర్శనానంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ట్రస్ట్ బోర్డు అధ్యక్షుడు బొమ్ము మధు, ఈవో నటరాజన్ షణ్ముగం వారికి ఆలయ మర్యాదలు అందజేశారు. ఆర్యవైశ్య ప్రముఖులు, పాలక మండలి సభ్యులు నాగోతి గురు, శాంతి, చందు, నాగోతి విజయనిర్మల పాల్గొన్నారు.

రథం సెంటర్‌లో అన్నదానం

వన్‌టౌన్ రథం సెంటర్‌లోని అప్పన వెంకటస్వామయ్య కామేశ్వరమ్మ చారిటబుల్ ట్రస్ట్ గురువారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, ఎమ్మెల్యే సుజనా చౌదరిలు పాల్గొన్నారు. అన్నదాన కార్యక్రమంలో వారు వడ్డన చేశారు. ఈ సందర్భంగా సుజనా చౌదరి మాట్లాడుతూ శతాబ్ది కాలంగా చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న సేవలను కొనియాడారు. లయన్స్ క్లబ్ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అప్పన ట్రస్ట్ నిర్వాహకులు అప్పన సాయిబాబు, లయన్స్ క్లబ్ సభ్యులు అలమూరు అమర్నాథ్, కొండేపు హనుమంతరావు, మూల్పూరు ఉపేంద్ర, ఆద్దూరి శ్రీరామ్, లయన్స్ వాసవీక్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు

పటమట, అక్టోబరు 10 : ప్రపంచ మానసిక దినోత్సవాన్ని పురస్కరించుకుని వరల్డ్ కాంగ్రెస్ ఆఫ్ సైకాలజిస్ట్, లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ స్పార్క్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం బెంజిసర్కిల్‌లోని స్పార్క్ సైకాలజికల్ కౌన్సెలింగ్ సెంటర్‌లో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ అన్నపురెడ్డి కోటిరెడ్డి మాట్లాడుతూ మానసిక ఇబ్బందులు ఎదుర్కొనేప్పుడు సైకాలజిస్టును కలవాలని సూచించారు. సీనియర్ సైకాలజిస్ట్ రమాదేవి మాట్లాడుతూ ఒత్తిడి మోతాదుకు మించినప్పుడు తప్పకుండా తగ్గించుకోవాలని ప్రయత్నం చేయాలని వివరించారు. స్పార్క్ సైకాలజీ కౌన్సెలింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ బాబిశెట్టి మాట్లాడుతూ మానసిక ఆరోగ్యం పెంపొందించటానికి ప్రతి స్కూల్, కాలేజీ, ప్రభుత్వ ప్రైవేట్ కార్యాలయాల్లో ఉచిత అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. లయన్స్ మిత్రులు హనుమకుమార్, రవిప్రసాద్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అన్నపురెడ్డి కోటిరెడ్డి



ఆర్థిక సహాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం

అజిత్‌సింగ్‌నగర్, అక్టోబరు 10 : కోమటి సంఘం ఆధ్వర్యంలో వరద బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం, నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. అజిత్‌సింగ్‌నగర్‌లోని భరతమాత మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, కూరకుల వడ్డి శ్రీనివాసరావు(వాసు) పాల్గొని వరద బాధిత కుటుంబాలకు పాత్రలు కొనుగోలు నిమిత్తం 80 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 1000 చొప్పున, నెలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు పెద్దిన తిరుమలరావు, ఉన్న నాగభూషణరావు, గోపాలశెట్టి సత్యనారాయణ, కొత్తకోట నరసింహమూర్తి పాల్గొన్నారు.

మహిళకు వీల్‌చైర్ అందజేత

రాజీవ్‌నగర్, అక్టోబరు 10: అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న రాజీవ్‌నగర్‌లోని 17వ డివిజన్‌కు చెందిన దరణికోట సామ్రాజ్యం అనే మహిళకు గద్దె క్రాంతికుమార్ వీల్ చైర్‌ను అందజేశారు. ఇటీవల డివిజన్ పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌కు వీల్‌చైర్ ఆవశ్యకతను సామ్రాజ్యం రంగమ్మ ఆమె పరిస్థితిని వివరించడంతో స్పందించిన ఆయన గురువారం వీల్ చైర్‌ను పంపగా గద్దె క్రాంతి మహిళకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయి రంగమ్మ, సునామీ పాల్గొన్నారు.

ఏకలవ్యనగర్‌లో బియ్యం పంపిణీ



భవానీపురం, అక్టోబరు 10 : 43వ డివిజన్ టీడీపీ సీనియర్ నాయకులు మేరా బోయిన రాంబాబు గురువారం ఏకలవ్య నగర్‌లోని వరద బాధితులకు రూ.20వేలు విలువైన బియ్యాన్ని 250 కుటుంబాలకు ఇంటింటికి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ వాణిజ్య విభాగం అధ్యక్షులు జంగ్ సెక్రటరీ ఐదుకూరి యువరాజు, సందక వెంకట్రావు, పొదిలి ప్రసాద్, బండి వెంకటేశ్వర్లు, మెట్ల నరసింహారావు, నవీన్, బాలు, వేల్పుల నరేంద్ర, కోటి, అర్జునరెడ్డిలు పాల్గొన్నారు.

షాలేమ్‌రాజుకు సత్కారం

ధర్నాచౌక్, అక్టోబరు 10: రాష్ట్రస్థాయి యోగాసనాల పోటీల్లో రెండు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచిన నగరానికి చెందిన పారుపల్లి షాలేమ్‌రాజును అంధించాంది మున్సిపల్ స్టేడియంలోని అమరావతి యోగ అండ్ ఏరోబిక్స్ కార్యాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాజుకు తమ అసోసియేషన్ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. పలువురు షాలేమ్‌రాజును అభినందించారు. కోశాధికారి లావణ్యకుమార్, సభ్యులు ఎల్లారావు, సురేంద్ర, వెంకట్, మహిపాల్, సిరాజ్, యోగా గురువు అంకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వాంబేకాలనీలో ఉచిత వైద్య శిబిరం

పాయకాపురం, అక్టోబరు 10 : వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు అనారోగ్యాల బారిన పడకుండా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించామని క్రౌన్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ ఎ. రమేష్ పాల్ అన్నారు. 60వ డివిజన్ వాంబేకాలనీలో ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సాధారణ జ్వరాలు, గుండె సంబంధిత వ్యాధి, బీపీ, షుగర్, కంటి, నరాల బలహీనత తదితర వ్యాధులకు సంబంధించిన రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ కాటిస్‌బాబు, డాక్టర్లు సూరెడ్డి అరవింద్, ఈ.యూస్టిల్స్, డి.వరుణ్, వి. విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై ప్రతి ఒక్కరికీ శ్రద్ధ ఉండాలి

రైల్వేస్టేషన్, అక్టోబరు 10: ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరికీ శ్రద్ధ ఉండాలని విజయవాడ రైల్వే డివిజన్ అసిస్టెంట్ డివిజ్ మెడికల్ సూపరింటెండెంట్ ఎం.జెడిస్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం విజయవాడ రైల్వే ఆసుపత్రిలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ ఎం.సౌరాబాల ఆధ్వర్యంలో పనిలో మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన సమయం ఆసన్నమైంది అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం.జెడిస్, సైక్రియాటిస్టు డాక్టర్ శ్రీధర్ కొల్లి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైల్వే ఉద్యోగులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంత యువతకు ఉపాధి శిక్షణ

వన్‌టౌన్, అక్టోబరు 10: సింగ్‌నగర్‌లో సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ముంపు ప్రాంతాల్లోని యువతకు ఏసీ రిపేర్, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, తదితర శిక్షణ కార్యక్రమాలు ఇస్తున్నట్టు సేవా సంస్థల రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి, సీతారామపురంలోని యూనిట్ కన్వీనర్ విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్‌కు వివరించారు. గురువారం దానికి సంబంధించిన వివరాలను అందజేశారు. ఏసీ రిపేర్ శిక్షణ పొందిన వారికి క్యాంపస్ ప్లేస్‌మెంట్ కూడా ఉంటుందన్నారు. ఎంపీ స్పందిస్తూ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వటం ఆనందదాయకమని, తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.

పోలవరానికి నిధులు రావటం అభినందనీయం: గన్నే ప్రసాద్

వన్‌టౌన్, అక్టోబరు 10: పోలవరానికి కేంద్రం నిధులు ఇవ్వటం అభినందనీయమని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గన్నే ప్రసాద్ (అన్న) గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో ఏడుగురు కేంద్ర మంత్రులను కలుసుకుని రాష్ట్రానికి నిధులు సాధించడానికి ప్రతిపాదనలు అందచేశారన్నారు. అప్పుల ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు తన అనుభవంతో, కేంద్ర సహకారంతో ఆర్థిక పరిపుష్టి కలిగించేందుకు ప్రయత్నం చేస్తుంటే జగన్ రెడ్డి తన మీడియా ద్వారా నిస్సిగ్గుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు. సమాజంపై బాధ్యత, విలువలు లేని వ్యక్తిలే ఇలాంటి రాతలు రాస్తారని, జగన్ మోహన్ రెడ్డి, వైసీపీ రెండూ రాష్ట్రానికి అరిష్టమని వ్యాఖ్యానించారు.

రతన్ టాటాకు నివాళి


నివాళులర్పిస్తున్న నేతలు

జగ్గయ్యపేట, అక్టోబరు 10 : పారిశ్రామికవేత్త రతన్‌టాటా గొప్ప మానవతా వాది అని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య కొనియాడారు. తాతయ్య నివాసంలో, మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పెనుగంచిప్రోలు:పెనుగంచిప్రోలులో రతన్ టాటాకు పలువురు నేతలు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు, మహమ్మద్ ఆజాద్, చిరంజీవి, గోపి పాల్గొన్నారు.

నందిగామరూరల్: పారిశ్రామికవేత్త టాటా గ్రూప్ చైర్మన్ రతన్ టాటా చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు.సీతా రామయ్య, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

జగ్గయ్యపేట:మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర ఆధ్వర్యంలో పారిశ్రామికవే త్త రతన్‌టాటా మృతికి గురువారం నివాళులు అర్పించారు. రఘు, సైదే శ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.


నందిగామలో సత్యమ్మ


జగ్గయ్యపేటలో..

దుర్గాదేవీ నమోస్తుతే..

నందిగామరూరల్, అక్టోబరు 10: అంబారుపేటలో సత్యమ్మ అమ్మవారు కనకదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. ఈవో హరిగోపీనాద్ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు.

జగ్గయ్యపేట: గాయత్రీ అమ్మవారు, కన్యకపరమేశ్వరీ, మహాలక్ష్మీ అమ్మవార్లు దుర్గారూపంలో దర్శనమిచ్చారు. నకాని బజార్‌లోని దుర్గగుడిలో శ్రీచక్రార్చన జరిగింది. 250 మంది మహిళలు ఉపవాస దీక్షతో శ్రీచక్రానికి కుంకుమార్చన చేశారు. దేవస్థానం ప్రయివేట్ ఇంప్రూవ్‌మెంట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వరరావు సెక్రటరి కనకనాగేశ్వరరావు, కోశాధికారి శేషు లు పర్యవేక్షించారు. అద్దాలబజార్‌లోని మహాలక్ష్మీ వెండి దే వాలయాన్ని జనసేన నేత, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పూజలు చేశారు. రేణుక పరమేశ్వరీ దేవస్థానంలో సద్దుల బతుకమ్మతో ఉత్సవాలు ముగిశాయి.

జగ్గయ్యపేట రూరల్: ముక్త్యాలలో భవానీ ముక్తేశ్వర స్వామి ఆలయంలో గురువారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు.

పెనుగంచిప్రోలు : ముండ్లపాడు గ్రామంలోని రైతు బజారులో అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించారు. గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

తిరువూరు: శాంతినగర్‌లోని కనదుర్గదేవి ఆలయంలో అమ్మవారిని గురువారం కనకదుర్గాదేవిగా అలంకరించారు.

పామాయిల్ విక్రయ కేంద్రం ప్రారంభం

జగ్గయ్యపేట, అక్టోబరు 10 : ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తాతయ్య చెప్పారు. రైతుబజార్‌లో లీటర్ రూ.115లకు పామాయిల్ విక్రయ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. సబ్సిడీ పై టమాటో, ఉల్లి గడ్డలు, కందిపప్పు బియ్యాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ రాఘవేంద్ర, ఐటి కేవీ రమణ, నూకల బాల కృష్ణ, షైనేని రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తన్నీరు

రిలే నిరాహార దీక్ష

జగ్గయ్యపేట:వరద బాధితులకు తక్షణం సహాయం అందించాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చే శారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన ఒక రోజు రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగిపై కేసు

జగ్గయ్యపేటరూరల్ : సిమెంట్ కర్మాగారంలో రూ. లక్షలు అక్రమంగా తన ఖాతాకు మళ్లించుకున్న ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తోట సూర్య శ్రీనివాస్ పేర్కొన్నారు. ముక్త్యాల సమీపంలోని కాకతీయ సిమెంట్స్ కర్మాగారంలో కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అధికారిగా పని చేస్తున్న గోపాలకృష్ణంరాజు 53 నెలలుగా అంచలంచెలుగా తన జీతాన్ని పెంచుకుంటూ రూ. 86.50 లక్షలు అదనంగా డ్రా చేసినట్లు యాజమాన్యం గుర్తించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


ప్రశంసాపత్రం అందుకుంటున్న రాంప్రదీప్

రాంప్రదీప్‌కు ప్రశంసాపత్రం

తిరువూరు, అక్టోబరు 10: సెంటర్ ఫర్ టీచర్స్ అక్రిడిటేషన్(సెంటా) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన, ఆన్‌లైన్ గ్లోబల్ సమ్మిట్‌లో గానుగపాడు జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం.రాంప్రదీప్ పాల్గొన్నారు. గురువారం సెంటా జారీ చేసిన ప్రసంశా పత్రాన్ని ఎంపీడీవో పివిఎస్. నాగేశ్వరరావు చేతుల మీదుగా ఆయన స్వీకరించారు. 176 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్న ఈ సమ్మిట్‌లో ఆధునిక విద్యలో టెక్నాలజి ఏ మేరకు అవసరం అనే అంశంపై రాంప్రదీప్ ఆన్‌లైన్ ద్వారా సెంటాకు పంపిన ప్రతిపాదనకు ఆ సంస్థ ప్రశంసాపత్రాన్ని జారీ చేసింది.

ఘనంగా బతుకమ్మ వేడుకలు

నందిగామ : గోళ్లమూడి, చందాపురం గ్రామాలలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గోళ్లమూడి శివాలయంలో మహిళలు బతుకమ్మలను తయారు చేసి పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి పూజలు చేసి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు గాడిపర్తి శ్రీనివాసరావు చిన్నారులకు సంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. చావా అర్జున్‌రావు, బత్తిన రవి, పేర్ని రమేష్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలి

జగ్గయ్యపేట: గోవులను రక్షించాలని, గోవును జాతీయ జంతువుగా ప్రకటించి రక్షించాలని దేశవ్యాప్త ఉద్యమం చేస్తున్న ఉత్తరాఖండ్ జ్యోతిర్మట్ పీఠాధిపది జగద్గురు అవిముక్తేశ్వరానంద సరస్వతి స్వామి వారు రాష్ట్రంలో మద్దతు కూడగట్టేందుకు గురువారం జగ్గయ్యపేటకు విచ్చేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర తదితరులు వేదపండితులు పిల్లలమర్రి నాగకృష్ణశర్మతో కలిసి పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి ఆశీస్సులు పొందారు.

రతన్‌టాటాకు టీడీపీ నాయకుల నివాళి

తిరువూరు : స్థానిక నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో రతన్‌టాటా మృతికి టీడీపీ నాయకులు సంతాపం తెలిపారు. పార్టీ కార్యాలయంలో టాటా చిత్రపటానికి, పార్టీ నాయకులు శావల దేవదత్, గద్దె వెంకటేశ్వరరావు, అనిల్‌చౌదరి, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. రతన్‌టాటా తన ట్రస్టు ద్వారా పేదలకు అందించిన వైద్యసేవలు, ఆయన సాగించిన సామాజిక సేవాకార్యక్రమాలను పలువురు కొనియడారు.

ఆత్మీయ సమ్మేళనం

రెడ్డిగూడెం, అక్టోబరు 10: రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 టెన్త్ బ్యాచ్ గురువారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. నాటి గురువులను ఘనంగా సత్కరించుకున్నారు.



హైవే బస్టాండును పరిశీలిస్తున్న తాతయ్య, చైర్మన్ రాఘవేంద్ర

వినియోగంలోకి హైవేబస్టాండ్

జగ్గయ్యపేట, అక్టోబరు 10: జగ్గయ్యపేట హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తెస్తామని, విద్యుత్ బస్సులకు ఛార్జింగ్ యూనిట్‌ను తెచ్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చెప్పారు. ఆయన గురువారం హైవే బస్టాండ్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. బస్టాండుపై నిఘా పెట్టాలని పోలీసులను ఆదేశించారు. త్వరలో ఆర్టీసీ చైర్మన్‌ను కలిసి సమస్యను వివరించి పరిష్కరించాలని కోరతామని తెలిపారు. చైర్మన్ రాఘవేంద్ర, కౌన్సిలర్లు గొట్టె నాగరాజు, సంగెపు బుజ్జిబాబు, నోముల రఘు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాతయ్య

గోవులకు పోషణ సరిగా లేదు : తాతయ్య

జగ్గయ్యపేట, అక్టోబరు 10: గోశాలల నిర్వహణకు కావల్సిన గ్రాసం పండించేందుకు ఆటవీ భూములను ఇప్పించేందుకు ప్రయత్నిస్తానని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చెప్పారు. గోశాలలో ఆశ్రయం పొందుతున్న గోవులకు సరైన గ్రాసం అందటం లేదని అభిప్రాయపడ్డారు. పట్టణ శివారు త్రిపురవరంలోని గోశాలకు ఉన్న 40 ఎకరాల భూమిని పూర్తిగా వినియోగంలోకి తెచ్చుకునేందుకు ప్రయత్నించాలని గోశాల నిర్వాహణకమిటిని కోరారు. గురువారం ఆర్ఎస్ఎస్, హిందూ చైతన్య వేదిక, గోశాల నిర్వహణ కమిటీలు హైవే బస్టాండు వద్ద ఏర్పాటు చేసిన గోసంరక్షణ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, నూకల బాలకృష్ణ, హిందూ చైతన్య వేదిక పట్టణ అధ్యక్షుడు సంకా భాస్కర్, నీలిశెట్టి సత్యనారాయణ, వాసు, ఏవీ శ్రీకాంత్, నోముల రఘు, వెంగళరావు తదితరులు పాల్గొన్నారు.













గుళ్లపల్లి జ్యోత్స్నకు కన్నీటి వీడ్కోలు

- ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ నివాళి
- సుంకరను పరామర్శించిన రాఘవులు
- వారంరోజులు 'బార్' సంతాప దినాలు

విజయవాడ లీగల్, అక్టోబరు 10 : గుళ్లపల్లి జ్యోత్స్న పార్థివదేహాన్ని గురువారం పలువురు న్యాయవాదులు, సీపీఎం, ఐద్వా నాయకులు, వైద్య ప్రముఖులు సందర్శించి నివాళులర్పించారు. వీరిలో అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర లీగల్‌సెల్ ప్రధాన కార్యదర్శి సెంట్రల్ ఆఫీస్ ఇన్‌చార్జి గూడపాటి లక్ష్మీనారాయణ, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, ఎం.ఎ.బేబి, నేతలు సీహెచ్ బాబురావు, దోనేపూడి కాశీనాథ్, వై.కేశవరావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి టి.రమాదేవి, సీపీఎం రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యుడు వై.వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్రకమిటీ సభ్యుడు ఎం.ఎ.గఫూర్, వైద్యులు సురేంద్ర, జితేంద్ర, సుధాకర్, ప్రమోద్, అమ్మన్న, సూరపనేని ప్రవీణ్, సూరపనేని నవీన్, అరుణా సురేంద్ర, మారుతి, పారిశ్రామికవేత్త కోగంటి సత్యనారాయణ, బార్ కౌన్సిల్ సభ్యులు చలసాని అజయ్‌కుమార్, సూరాబత్తుల మల్లేశ్వరరావు, భీమవరం న్యాయమూర్తి ధనరాజ్, పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి అరుణ్‌కుమార్, అమ్మ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వై.సుబ్బారావు, మెట్రో ఏజెన్సీస్ అధినేత వై.రమేష్, రాజ్యసభ మాజీ సభ్యుడు పి.మధు, మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్, ఎంబీవీకే ఇన్‌చార్జి తులసీరావు, బాలోత్సవ్ భవన్ కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి రామన్న, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్న, న్యాయవాదులు పాల్గొన్నారు. అనంతరం జ్యోత్స్న భౌతికకాయాన్ని ఉదయం 11 గంటలకు ఎన్ఆర్ఐ వైద్యకళాశాల విద్యార్థులకు పరిశోధన నిమిత్తం అప్పగించారు.


జ్యోత్స్న పార్థివదేహం వద్ద నివాళులర్పిస్తున్న దమ్మాలపాటి శ్రీనివాస్, గూడపాటి లక్ష్మీనారాయణ, రాఘవులు తదితరులు

వారంపాటు 'బార్' సంతాప దినాలు

\- అరిగెల శివరాంప్రసాద్ (రాజా)

విజయవాడ లీగల్ : జ్యోత్స్న మేడమ్ దుర్మరణం బాధాకరమని బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా) అన్నారు. ప్రమాదం జరిగిన బస్సులో తాను కూడా వున్నానని, అందరూ గాఢనిద్రలో వుండగా తాము ప్రయాణిస్తున్న బస్సు ఆగివున్న లారీని ఢీకొట్టి పక్కనే వున్న మరో లారీని ఢీకొందన్నారు. ప్రమాదంలో డ్రైవర్ వెనుక సీటులో వున్న సుంకర రాజేంద్రప్రసాద్‌కు గాయాలు కాగా.. జ్యోత్స్న మేడమ్ బస్సు ముందు అద్దాల నుంచి కిందకు పడిపోయారని, బస్సు ఆమె పైనుంచి వెళ్లడంతో మృతిచెందారని చెప్పారు. కిందపడిన మేడమ్ పైనుంచి బస్సు వెళ్లకుండా వుండివుంటే రోడ్డుదెబ్బలతో బ్రతికివుండేవారని రాజా ఆవేదన వ్యక్తం చేశారు. తనతో పాటు పదిమంది న్యాయవాదులకు స్వల్ప గాయాలయ్యాయని రాజా తెలిపారు.

జ్యోత్స్న మేడమ్ మృతికి బెజవాడ బార్ వారం రోజుల పాటు సంతాపదినాలుగా ప్రకటించాలని నిర్ణయించినట్టు రాజా తెలిపారు. శుక్రవారం నుంచి వారం రోజుల పాటు ఈ సంతాపదినాలు వుంటాయని ఆయన పేర్కొన్నారు.


సబ్సిడీపై పామాయిల్

జగ్గయ్యపేట : ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే తాతయ్య చెప్పారు. రైతుబజార్‌లో లీటర్ రూ.115 పామాయిల్ విక్రయ కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. సబ్సిడీపై టమాటో, ఉల్లిగడ్డలు, కందిపప్పు బియ్యాన్ని అందిస్తున్నట్టు తెలిపారు.



కనకదుర్గమ్మ సన్నిధిలో వేదార్చన..

వన్‌టౌన్ : ఇంద్రకీలాద్రిపై ప్రతీఏటా దసరా ఉత్సవాల సమయంలో దుర్గాష్టమి సందర్భంగా కనకదుర్గమ్మ సన్నిధిలో వేదార్చన జరుగుతుంది. గురువారం ఆలయంలోని మహామండపం ఆరో అంతస్తులో వేదపండిత సత్కార సభను నిర్వహించారు. ఈ సందర్భంగా దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొని పండిత సత్కారం చేశారు. ఆయన మాట్లాడుతూ, వేదాలను పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని గురించి చెప్పారు. తెలుగు రాష్ట్రాలు, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి రుగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాల్లో నిష్ణాతులైన పండితులు, ఘనాపాటీలు, క్రమపాటీలు వేదసభకు విచ్చేశారు. అనంతరం వేద ఘోషతో శాంతిమంత్రాలు పఠించారు. వేద పారాయణ చేశారు. అనంతరం పండితులను సత్కరించారు. కార్యక్రమంలో 130 మంది ఘనాపాటీలకు రూ.6వేలు చొప్పున, 262 మంది క్రమపాటీలకు రూ.5వేలు చొప్పున పారితోషకాలను, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. సభాధ్యక్షుడికి రూ.10వేలు పారితోషకం అందజేశారు.


వేద పండితులను సత్కరిస్తున్న మంత్రులు ఆనం రామనారాయణ రెడ్డి, సత్యప్రసాద్ యాదవ్


















మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

సంక్షేమ పాలనకు దుర్గమ్మ ఆశీస్సులు కోరా: సత్యకుమార్

లబ్బీపేట, అక్టోబరు 10: రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పాలనకు, నాయకత్వానికి ఆశీస్సులుండాలని అమ్మవారిని కోరుకున్నట్టు మంత్రి సత్యకుమార్ తెలిపారు. గురువారం సాయంత్రం అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మీ డియా పాయింట్ వద్ద మాట్లాడుతూ దస రా మహోత్సవాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరుగుతున్నాయని, ఉత్సవాలు ఇంత ఘనంగా నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్న మంత్రి ఆనం రామనారాయణ రెడ్డికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తె లుపుతున్నానన్నారు. వేద సభలో మహాపండితులు మన వేదాలను పఠిస్తుంటే పు లకించిపోయానని ఈ సందర్భంగా వారిని అభినందిస్తున్నానని అన్నారు.

విజయవంతంగా దసరా ఉత్సవాలు: బుద్దా వెంకన్న

వన్‌టౌన్: కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయని మాజీ ఎమ్మె ల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. గురువారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్న ఆయ న మాట్లాడుతూ దుర్గమ్మ ఆలయంలో సా మాన్య భక్తులకు అమ్మవారి దర్శనం సులభంగా అందుతోందన్నారు. సీఎం చంద్రబా బు కూడా మూల నక్షత్రం నాడు ఎలాంటి ఆర్భాటాలు లేకుండా అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి, దర్శనం చేసుకుని వెళ్లిపోయారన్నారు. మూలనక్షత్రం రోజున పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు.

దుర్గమ్మకు ఉత్సవ కమిటీ సభ్యుల సారె

పటమట: నవరాత్రులను పురస్కరించుకుని 8వ రోజున అమ్మవారికి ఉత్సవ కమిటీ సభ్యులు సారె సమర్పించారు. జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ గద్దె అనురాధ, కమిటీ సభ్యులు శాయన సత్యనారాయణ, చలసాని రమణ, రత్నశ్రీ, అంబటి విశ్వనాథ్, మాకినీడి నీరజ, రమేష్, కాశీ పాల్గొన్నారు.

వచ్చేనెల 13 నుంచి శ్రీవిదురశేఖర భారతీస్వామి రాష్ట్ర పర్యటన

సత్యనారాయణపురం: దక్షిణామ్నాయ శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి జగద్గురు శ్రీ విదురశేఖర భారతీస్వామి నవంబరు 13 నుంచి 27 వరకూ రా ష్ట్రంలో పర్యటిస్తారని శృంగేరి పీఠం గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. నవంబరు 13న బుధవారం చెన్నై నుంచి తిరుమల చేరుకుంటారు. 13, 14న అక్కడే బసచేసి 15న శుక్రవారం తిరుపతి చేరుకుంటారు. 16న శనివారం శ్రీకాళహస్తికి వెళ్లి సాయంత్రానికి నెల్లూరు చేరుకుంటారు. 17న ఆదివారం నెల్లూరు నుంచి నగరానికి చేరుకుంటారు. 18, 19న శ్రీ శృంగేరీ శారదా పీఠపరిపాలిత శివరామకృష్ణక్షేత్రం (సత్యనారాయణపురం)లో విడిది చేస్తారు. 20న న గరం నుంచి నరసరావుపేట చేరుకుంటారు. 21న అ క్కడి నుంచి గుంటూరు చేరుకుంటారు. 21న గురువారం రాత్రి నుంచి 24న ఆదివారం వరకూ గుం టూరు సంపత్‌నగర్ శ్రీశారదా పరమేశ్వరీ దేవస్థానంలో బసచేసి భక్తులను అనుగ్రహించి అక్కడ నుంచి గుడి మెల్లంక వెళతారు. 24న రాత్రి నుంచి 26న మంగళవారం ఉదయం వరకూ గుడి మెల్లంకలో బస చేసి అక్కడ నుంచి 26న రాజమహేంద్రవరం చేరుకుంటారు. 27న తిరిగి శృంగేరికి తిరుగు ప్రయాణమవుతారని పీఠం తెలిపింది.

ఆర్ఈఎంఎస్ స్కీమ్‌ను అమలు చేయాలి

బస్టేషన్: ఆర్టీసీ ఉద్యోగులకు రిటైర్ అయిన తరువాత విలీనానికి ముందు ఉన్న పద్ధతిలో రిటైర్డ్ ఎంప్లాయిస్ మెడికల్ స్కీమ్‌ను (ఆర్ఈఎంఎస్) అ మలు చేయాలని ఏపీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జి.వి.నరసయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఆర్టీసీ విలీనానంతరం గత ప్రభుత్వం నిలుపుదల చేసిన ఆర్ఈఎంఎస్ స్కీమ్‌ను మంత్రి చొరవ తీసుకుని పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం రిటైర్ అవుతున్న వారందరికీ ఆర్టీసీ ఆసుపత్రుల్లో వైద్య సౌకర్యాలు, మందుల పంపిణీతో పాటు ఈహెచ్ఎస్ వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నా రు.







ఇసుక అందుబాటులోకి తీసుకురండి

భవన నిర్మాణ కార్మికులతో కలిసి ఆర్డీవోకు దేవదత్ వినతి

తిరువూరు, అక్టోబరు 10: నియోజక వర్గంలో నిర్మాణ రంగానికి అవసరమయిన ఇసుక అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శావల దేవదత్ ఆర్డీవో మాధురికి వినతిపత్రం అందజేశారు. భవన నిర్మాణ కార్మికులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు.ఇసుక లేకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయని, దాంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారన్నారు. కార్మికులు దేవదత్ దృష్టికి తీసుకొచ్చిన సమసమ్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళడంతో పాటుగా, అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికులతో ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతిపత్రం అంద జేశారు. సత్వరం ఇసుక అందుబాటులోకి వచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గద్దె వెంకటేశ్వరరావు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.


ఆర్డీవో మాధురికి వినతిపత్రం అందజేస్తున్న శావల దేవదత్





రతన్‌టాటాకు టీడీపీ నాయకుల నివాళి

తిరువూరు, అక్టోబరు 10: నియోజకవర్గం టీడీపీ కార్యాలయంలో రతన్‌టాటాకు టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు. పార్టీ కార్యాలయంలో టాటా చిత్రపటానికి, శావల దేవదత్, గద్దె వెంకటేశ్వరరావు, అనిల్‌చౌదరి, తదితరులు పూలమాల వేసి నివాళి అర్పించారు. రతన్ టాటా తన ట్రస్టు ద్వారా పేదలకు అందించిన వైద్యసేవలు, ఆయన సాగించిన సామాజిక సేవాకార్యక్రమాలను పలువురు కొనియడారు.

జగ్గయ్యపేట : పారిశ్రామికవేత్త రతన్‌టాటా గొప్ప మానవతా వాది అని ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నివాళులు అర్పించారు. తాతయ్య నివాసంలో, మునిసిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, టీడీపీ కౌన్సిలర్ కన్నెబోయిన రామలక్ష్మి, సంగెపు బుజ్జిబాబు, పేరం సైదేశ్వరరావు, గింజుపల్లి వెంకట్రావు, పుల్లారావు, తదితరులతో కలిసి పూలమాలలు వేసి తాతయ్య టాటా సేవలను స్మరించుకున్నారు.



కనకదుర్గాదేవిగా అమ్మవారు

తిరువూరు, అక్టోబరు 10: శాంతినగర్‌లోని కనకదుర్గాదేవి ఆలయంలో అమ్మవారిని గురువారం కనకదుర్గాదేవిగా అలంకరించారు. ఉదయం ప్రత్యేక పూజల అనంతరం మహిళలచే సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌లో గౌరీకేదారేశ్వరస్వామి, అష్టలక్ష్మి ఆలయం, పీటీ కొత్తూరు, ఎన్ఎస్సీ కాలనీ, యాదవ బజార్ తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించారు.



నాగులూరులో..

రెడ్డిగూడెం: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగులూరులో అమ్మవారు గురువారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

పుట్రేల మారెమ్మ ఆలయంలో ..

విస్సన్నపేట : కనకదుర్గా ఆలయం, పుట్రేల మారెమ్మ ఆలయాల్లో గురువారం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తుల పూజలు చేశారు.

గంపలగూడెం: దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురష్కరించుకొని మండలంలోని దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి గజలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు.













వెండి మహాలక్ష్మికి ఉదయభాను పూజలు

జగ్గయ్యపేట :పట్టణంలో అద్దాలబజార్‌లో వేంచేసియున్న మహాలక్ష్మీ అమ్మ వారి వెండి దేవాలయాన్ని జనసేన నేత, మాజీ ఎమ్మె ల్యే సామినేని ఉదయభాను దర్శించుకుని పూజలు చేశారు. ట్రస్ట్ ఛైర్మన్ అత్తులూరి వెంకటేశ్వర్లు తదితరులు స్వాగతం పలికి, అమ్మ వారి ప్రసాదాన్ని అందజేశారు.250 మంది మహిళలు ఉపవాస దీక్షతో శ్రీచక్రానికి కుంకుమార్చన చేశారు. వేదపండితులు మహంకాళి రామప్ప ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.





అంబారుపేటలో..

నందిగామ రూరల్: అంబారుపేటలో వేంచేసియున్న సత్యమ్మ కనకదుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈవో హరిగోపీనాథ్, అలయ ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో కుంకుమార్చనలు, అష్టోత్తర సహస్రనామ పూజలు, చండీ సహిత రుద్ర హోమాది క్రతువులు నిర్వహించారు. పల్లగిరి గట్టుపై ఉన్న త్రిశక్తి పీఠంలోని కనకదుర్గ, జ్ఞాన సరస్వతీ, కనకమహాలక్ష్మీ అమ్మవార్లు, మండలంలోని లింగాలపాడులో లక్ష్మీ పేరంటాళ్లమ్మ, పట్టణంలోని సువశ్యామలాంబ, వాసవీ కన్యకా పరమేశ్వరీ, మరిడీ మహాలక్ష్మీ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు చేశారు. గోళ్లమూడి శంభులింగేశ్వర స్వామి, కూడలి సంగమేశ్వర స్వామి వారి ఆలయాలలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు.



- గోళ్లమూడి, చందాపురం గ్రామాల్లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. గోళ్లమూడి శివాలయంలో మహిళలు బతుకమ్మలను తయారు చేసి పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో గౌరీదేవికి పూజలు చేసి బతుకమ్మలను నిమజ్జనం చేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు గాడిపర్తి శ్రీనివాసరావు చిన్నారులకు సంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం చిన్నారులకు పెన్నులు, పుస్తకాలు, ప్యాడ్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు చావా అర్జున్‌రావు, బత్తిన రవి, పేర్ని రమేష్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు: మండలంలో 8వ రోజైన గురువారం అమ్మవారిని కనకదుర్గాదేవిగా అలంకరించి విశేషపూజలు నిర్వహించారు. దీనిలో భాగంగా మండలంలోని ముండ్లపాడులోని రైతు బజారున నిర్వహిస్తున్న నవరాత్రుల పందిరి వద్ద గురువారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.













క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందిస్తాం

● స్పోర్ట్స్ పాలసీపై సలహాలు స్వీకరించిన మంత్రి, శాప్ చైర్మన్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, పక్కన శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడ స్పోర్ట్స్, అక్టోబరు 10: రాష్ట్రంలో 175 నియోజకవర్గాల్లో గ్రామీణ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కలెక్టరేట్ సమావేశంలో శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడుతో కలిసి క్రీడా పాలసీపై వివిధ క్రీడా సంఘాల నుంచి సూచనలు సలహాలను గురవారం సమావేశం నిర్వహించి స్వీకరించారు.

క్రీడా ప్రతిష్టకు నడుం కట్టండి

రాష్ట్రంలో క్రీడా సంఘాలకు నిధులు విడుదల చేసి క్రీడా ప్రతిష్టను ఇనుమడింపజేయాలని క్రీడా సంఘాల ప్రతినిధులు ముక్తకంఠంతో పిలుపునిచ్చారు. ఏపీవోఏ రాష్ట్ర సెక్రటరీ కేపీ రావు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో కోట్లలో ఖర్చు పెడుతున్నామని, క్రీడాకారులు టోర్నీల్లో పాల్గొనేటప్పుడు టీఏ, డీఏతో పాటు జెర్సీలను ఇచ్చి ప్రోత్సహించాలని, వీటికి రూ.5కోట్లకు మించి అవదన్నారు. అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాయింట్ సెక్రటరీ ఆకుల రాఘవేంద్ర మాట్లాడుతూ ఏపీకి చెందిన ఒలింపియన్ అథ్లెట్లు యర్రాజీ జ్యోతి, దండిక జ్యోతిక శ్రీ భేషుగ్గా రాణిస్తున్నారని, ఏషియన్ మెడల్స్‌ను సాధించారని వారికి ఇంటిస్థలం, ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏపీ కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్ మాట్లాడుతూ క్రీడా యాప్‌లో ప్రతిభ చాటిన క్రీడాకారులు చోటు కల్పించాలని, అకాడమీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకానీ మాట్లాడుతూ రాష్ట్రంలో వాటర్ స్పోర్ట్స్ అవకాశాలు మెండుగా ఉన్నాయని, ఈ క్రీడలకు ప్రాతినిధ్యం పెంచితే ఒలింపిక్స్‌లో పతకాలను సాధించవచ్చునన్నారు.

మంత్రి, శాప్ చైర్మన్‌ల భరోసా

సీఎం చంద్రబాబుతో మాట్లాడి రూ.10 కోట్ల కార్పస్ ఫండ్‌ను తెస్తానని మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ శాప్ తరపున క్రీడాకారులకు ఉన్నతమైన సౌకర్యాలకు పెద్దపీట వేస్తామన్నారు. శాప్ వీసీఎండీ గిరిషా, ఏడీ రమణమ్మ పాల్గొన్నారు.

ఫైనల్స్ దశకు జాతీయ బ్యాడ్మింటన్ టోర్నీ

విజయవాడ: నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియం, సాయి సందీప్ అకాడమీల్లో జరుగుతున్న యోనెక్స్ సన్‌రైజ్ ఆలిండియా సబ్ జూనియర్స్ బ్యాడ్మింటన్ (కలగర నాగబాబు మెమోరియల్) బాలబాలికల బ్యాడ్మింటన్ టోర్నీ ముగింపు దశకు చేరింది. గురువారం మూడో స్థానంలో నిలిచిన మిక్స్‌డ్ డబుల్స్ అండర్-15లో కాంస్యం సాధించిన రోహన్ పబ్బిసెట్టి, ధ్రీతి సహస్ర (తెలంగాణ) జోడీకి కాంస్యం, ప్రైజ్‌మనీ చెక్కులను మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అందించారు. ఏపీబీఏ సెక్రటరీ పోలినేని అంకమ్మ చౌదరీ, ఏపీబీఏ సీఈవో చుక్కా శ్రీనివాస్, ర్యాంకింగ్ టోర్నీ పరిశీలకులు రాజేష్‌రెడ్డి (కర్ణాటక) పాల్గొన్నారు.

ఫైనల్స్‌కు చేరిందీ వీరే..

అండర్-15 బాలికల సింగిల్స్‌లో షైనా (కర్ణాటక) అన్వి విక్రమ్ గోవింద్ (తెలంగాణ)పై 21-19,21-13తోను, మోహిత పోలవరం (తమిళనాడు) అక్సా మేరీ (కేరళ)పై 16-21,21-16తో జయభేరి మోగించి ఫైనల్స్‌కు చేరారు. బాలురసింగిల్స్‌లో దేవ్ రూప్రాలియా (మహారాష్ట్ర) ప్రణవ్ (కర్ణాటక)పై 21-23,21-25,21-13తో విజయం సాధించి ఫైనల్స్‌కు చేరాడు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	128,137, 148
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.525

గైర్హాజరైన అధికారులపై చర్యలకు తీర్మానం

కంచికచర్ల రూరల్, అక్టోబరు 10: మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన తహసీల్దార్, ఆర్‌అండ్‌బీ అధికారులపై కలెక్టర్ తక్షణం చర్యలు తీసుకోవాలని గురువారం వైస్ ఎంపీపీ బండి మల్లికార్జునరావు అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. సమావేశంలో జడ్పీటీసీ సభ్యురాలు వేల్పుల ప్రశాంతి, వైస్ ఎంపీపీ వెలగలేటి మాధవి, ఎంపీడీవో బి.ఎం.లక్ష్మీ కుమారి, ఏఈ నరసింహారావు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.













పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

రెడ్డిగూడెం, అక్టోబరు 10: రెడ్డిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో 1994-95 టెన్త్ బ్యాచ్ గురువారం ఆత్మీయంగా కలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలతో రోజంతా ఉల్లాసంగా గడిపారు. నాటి గురువులను ఘనంగా సత్కరించుకున్నారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

విస్సన్నపేట, అక్టోబరు 10: తెల్లదేవరపల్లి తండాలో ఎన్నారై వల్లభనేని గిరిబాబు, టీడీపీ నాయకులు ఆర్థిక సహకారంతో మండల స్థాయి వాలీబాల్ టోర్నీని టీడీపీ నాయకులు రాయల సుబ్బారావు, ఉప సర్పంచ్ దారావతు చలపతి, రాయల రాజాలు ప్రారంభించారు. ఈ పోటీలు రెండు రోజులు జరుగుతాయన్నారు.

నగదు మళ్లింపులో ఉద్యోగిపై కేసు

జగ్గయ్యపేట రూరల్, అక్టోబరు 10: సిమెంట్ కర్మాగారంలో రూ. లక్షలు అక్రమంగా తన ఖాతాకు మళ్లించుకున్న ఉద్యోగిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తోట సూర్య శ్రీనివాస్ పేర్కొన్నారు. ముక్త్యాల సమీపంలోని కాకతీయ సిమెంట్స్ కర్మాగారంలో కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అధికారిగా పని చేస్తున్న గోపాలకృష్ణంరాజు 53 నెలలుగా అంచలంచెలుగా తన జీతాన్ని పెంచుకుంటూ రూ. 86.50 లక్షలు అదనంగా డ్రా చేసినట్లు యాజమాన్యం గుర్తించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నివాళి

పెనుగంచిప్రోలు : మానవతావాది మంచి మనస్సున్న స్ఫూర్తిదాయక పారిశ్రామిక వేత్త పద్మభూషణ్ రతన్ టాటా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జిల్లేపల్లి సుధీర్‌బాబు, మహమ్మద్ ఆజాద్, నల్లపనేని కొండ, పెనుగొండ గోపాలరావు, కంభం చిరంజీవి, గోపి దొడ్లకొండ తదితరులు పాల్గొన్నారు.














రైతును వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఆర్డీవో మాధురి

ఈక్రాప్ నమోదు పంటల పరిశీలన

చింతలపాడు(తిరువూరు), అక్టోబరు 10: మండలంలో ఈక్రాప్ నమోదుకు సంబంధించి ఎంపిక చేసిన గ్రామాల్లో సాగు భూములను ఆర్డీవో కె.మాధురి గురువారం పరిశీలించారు. చింతలపాడు, ఎరుకోపాడు, చిక్కుళ్లగూడెం తదితర గ్రామాల్లో ఈ క్రాప్‌లో నమోదు అయన పంటలను పరిశీలించారు. ఎరుకోపాడులో కొంగల రాములు, కొంగల వెంకటరత్నం, చిక్కుళ్ళగూడెంలో పల్లెపాటి శ్రీనివాసరావు అనే రైతులతో మాట్లాడారు. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


చైన్ స్నాచర్‌కు దేహశుద్ధి

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 10: కొండపల్లిలో గురువారం చైన్ స్నాచింగ్‌తో కలకలం రేగింది. కుమ్మరి బజారులో వెళుతున్న అన్నపూర్ణ అనే మహిళ మెడలో నుంచి బంగారు నానుతాడును ఓ వ్యక్తి లాక్కొని పరారయ్యాడు. వెంటనే స్పం దించిన కొందరు అతడిని ఆరుపంపుల సెంటర్‌లో పట్టుకు న్నారు. చైన్ స్వాధీనం చేసుకొని మహిళతో దొంగకు దేహశుద్ధి చేశారు. స్థానికులు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు.

ఆన్‌లైన్ గ్లోబల్ టీచర్స్ సమ్మిట్‌లో రాంప్రదీప్

తిరువూరు: సెంటర్ ఫర్ టీచర్స్ అక్రిడిటేషన్(సెంటా) ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన, ఆన్‌లైన్ గ్లోబల్ సమ్మిట్‌లో గానుగపాడు జడ్పీహైస్కూల్ ఉపాధ్యాయుడు ఎం.రాంప్రదీప్ పాల్గొన్నారు. సెంటా జారీ చేసిన ప్రసంశపత్రాన్ని గురువారం ఎంపీడీవో నాగేశ్వరరావు నుంచి అందుకున్నారు. 176 దేశాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్న సమ్మిట్‌లో పాల్గొన్నారు.









సాగు భూముల పరిశీలన

చింతలపాడు(తిరువూరు) అక్టోబరు 10 : మండలంలోని ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి ఎంపిక చేసిన గ్రామాల్లో సాగుభూముల్ని ఆర్డీవో కె.మాధురి గురువారం పరిశీలించారు. చింతలపాడు, ఎరుకోపాడు, చిక్కుళ్లగూడెం తదితర గ్రామాల్లో ఈ-క్రాప్ నమోదైన పంటల్ని పరిశీలించారు. ఎరుకోపాడులో కొంగల రాములు, కొంగల వెంకటరత్నం, చిక్కుళ్లగూడెంలో పల్లెపాటి శ్రీనివాసరావు అనే రైతులతో మాట్లాడారు. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది అందుబాటులో ఉంటున్నదీ, లేనిదీ వారిని అడిగి తెలుసుకున్నారు. పంట నమోదుకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. ఆర్డీవో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.











ధనలక్ష్మీగా దుర్గాదేవి

గంపలగూడెం, అక్టోబరు 10: మండలంలోని పలు గ్రామాలోని దేవాలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. నెమలి వేణుగోపాల స్వామి ఆలయంలోని రాజ్యలక్ష్మి అమ్మవారు, మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస స్వామి గజలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అమ్మవారిగా దర్శనమిచ్చారు.


















EDUCATION

» శ్రీనివాస డిస్టెన్స్ ఎడ్యుకేషన్: 100% పాస్ గ్యారంటీ ISO 9001:2015 APOSS ద్వారా 10th, Inter, నాగార్జున, ఆంధ్రా యూనివర్సిటీ ద్వారా BA, B.Com, B.Sc., M.Com, MBA, MCA, ✆ 99493 08940
AJB-194076

PLOT FOR SALE

» VJA, రాజధాని అమరావతి, మంగళగిరి, గన్నవరం బెంజిసర్కిల్‌కి 5 కిమీ, బందరు రోడ్డు, మన్న నూజివీడు రోడ్డు, కంచికచర్లలో DTCP, APCRDA ప్లాట్స్ చ.గ. 1900/- నుండి 12,900/- ఇళ్ళ మధ్యలో ఇళ్ళ ప్లాట్స్. సంప్ర. 73372 42575
AJB -90

రియల్ ఎస్టేట్

→ దసరా శుభాకాంక్షలతో... గుంటూరు జిల్లాలో శ్రీ భ్రమరాంబపురం కాలనీ & జనచైతన్య ప్లాట్స్ & UDA అప్రూవ్డ్ ప్లాట్స్ & పొలములు. అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. మన్నెం లతీష్ గౌడ్. Ph: 9848986831
AJG-207

→ అమరావతి రోడ్డు తాడికొండ, అడ్డరోడ్డు దగ్గర పొన్నెకల్లు ఊరి ప్రక్కనే 40 Acra CRDA ప్లాట్స్. సంప్రదించండి: Ravi. Cont: 9059440723.
AJG-203195

FLAT FOR SALE

» 2 & 3 BHK DELUXE FLATS, గృహ ప్రవేశానికి సిద్ధంగా ఉన్నవి. అయ్యప్పనగర్, కానూరు, పోరంకి, తాడిగడపలలో 34 Lakhs onwards. M.P. Developers సంప్ర. 89856 50007.
AJB - 88

TO-LET

» VJA బందరు రోడ్డు, టిక్కిలిరోడ్డు మేనర్ ఫుడ్ ప్లాజా ఎదురు రోడ్డులో 2వ ఫ్లోర్‌లో 1500 SFT, PLUG & PLAY ఆఫీసులకు A/c, ఫర్నిచర్‌తో సహా అద్దెకు కలదు. Cell: 98484 67899
AJB -194108

WANTED

» లేడీ టెలికాలర్స్ ప్రముఖ ఆఫీసు నందు పనిచేయుటకు కావలెను. Qlf.10th / Inter, కంప్యూటర్ Knowledge తప్పనిసరి. జీతం 10-12 వేలు + ఇన్సెంటివ్స్. ✆ 99124 21589, 99669 88544
AJB -276

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి





















దుర్గాదేవిగా అమ్మవారు

రెడ్డిగూడెం, అక్టోబరు 10: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నాగులూరులో అమ్మవారు గురువారం దుర్గాదేవిగా దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

విస్సన్నపేట: దేవిశరన్నవరాత్రులు సందర్భంగా విస్సన్నపేట కనక దుర్గా ఆలయం, పుట్రేల మారెమ్మ ఆలయాల్లో గురువారం దుర్గాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తుల పూజలు చేశారు.

అగ్రిసెట్-2024 ఫలితాలు విడుదల

అమరావతి, అక్టోబరు 10(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం గత ఆగస్టు 27న ఆన్‌లైన్‌లో నిర్వహించిన అగ్రిసెట్-2024 పరీక్షా ఫలితాలను వీసీ శారదాజయలక్ష్మి గురువారం విడుదల చేశారు. అగ్రిసెట్‌కు 897మంది బాలికలు, 659మంది బాలురు కలిపి 1,556 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 1,469 మంది వ్యవసాయ డిప్లొమా, 35మంది సేంద్రీయ వ్యవసాయం, 52 మంది విత్తన సాంకేతిక పరిజ్ఞానం విభాగాలో పరీక్షలు రాశారు.